



విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న డీఈవో రేణుకాదేవి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ప్రసాద్‌కుమార్

సమస్యల పరిష్కారానికే 'ప్రజలతో స్పీకర్'

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మర్పల్లి, బంట్వారం మండలాల్లో ఫిర్యాదుల స్వీకరణ

మర్పల్లి/బంట్వారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజలతో స్పీకర్' అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మర్పల్లి మండలంలో 120 డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తయ్యాయని, వాటిని ఇళ్లు లేని వారికి కేటాయిస్తామన్నారు. ప్రతీ వారం రెండు మండలాల్లో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. ఘనపూర్, కల్కోడ గ్రామాల్లో త్వరలోనే పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో నవోదయ విద్యాలయం, మర్పల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, సురేశ్‌యాదవ్, కృష్ణారెడ్డి, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం

ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం బంట్వారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలతో కలిసి ముఖాముఖీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం ప్రారంభిచడం జరిగిందన్నారు. స్థానిక నాయకులు ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి. నాయకులు యాదగిరి, శివకుమార్, నర్సిములు, నర్సింహ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



క్షేత్ర పరిశీలన..

జాబితా ప్రక్షాళన

ప్రారంభమైన గ్రామీణ ఓటరు సవరణ

గత డిసెంబరు జాబితా ప్రకారం

గ్రామీణ ఓటర్లు	6,99,894
పురుషులు	3,44,963
మహిళలు	3,54,912
ఇతరులు	19మంది

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ఒక్కొక్కటిగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటరు జాబితా ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా రూపొందించిన ఓటర్ల జాబితాను గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాతో సరిచూసి అధికారులు తుది జాబితా ఖరారు చేస్తున్నారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటిని సందర్శించి ఓటరు జాబితాలో నమోదైన వారందరూ ఉన్నారా? లేదా? వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయా? మార్పులు చేయాలా అనేది పరిశీలించి నమోదు చేయనున్నారు. నెలాఖరు వరకు ఓటరు జాబితా సవరణ పూర్తయ్యే అవకాశం ఉంది.

- క్షేత్ర స్థాయిలో బీఎల్వోలు ఇంటింటి పర్యటన
- గత డిసెంబరు జాబితా ప్రకారం వెరిఫికేషన్
- నెలాఖరులోగా ఖరారు కానున్న తుది ఓటరు జాబితా

పంచాయతీలు	594
వార్డులు	5,058
ఎంపీటీసీలు	227
జెడ్పీటీసీలు	20

వికారాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తుది ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గతేడాది డిసెంబరులో బీఎల్వోలు ఓటరు జాబితాలు రూపొందించారు. ఈ జాబితా ప్రకారం ప్రస్తుతం ప్రక్షాళన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 594 గ్రామ పంచాయతీలు ఉండగా, 5,058 వార్డులు ఉన్నాయి. గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాలను ఇది వరకే సిద్ధం చేశారు. జిల్లాలో 227 ఎంపీటీసీ, 20 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. జిల్లాలో గ్రామీణ ఓటర్లు 6,99,894 మంది ఉన్నట్లు లెక్క తేల్చారు. దీంట్లో 3,44,963 మంది పురుషులు




మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

తాండూరు రూరల్, జూలై 8, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఇక్కడ నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. మంగళవారం తాండూరు ప్రాథమిక పాఠశాల, కరన్‌కోట్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. 35 - 40 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే వారికి కంప్యూటర్ విద్యను అందించేలా కంప్యూటర్లను అందజేస్తామన్నారు. గౌతాపూర్‌లో చిన్నారులకు టై, బెల్టులు అందజేశారు. కరన్‌కోట్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, రాజప్ప గౌడ్, జెర్నె నాగప్ప, పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి ఫక్రోజీ, హెచ్ఎం లీలావతి, ఉపాధ్యాయులు ఉమారాణి, సుశీలా, మాధురి, రమాదేవి పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికలకు డీలిమిటేషన్ ఉత్తర్వులు

తాండూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఎన్నికల ప్రక్రియ మొదలైంది. 12వ తేదీన ఎంపీటీసీ స్థానాల నోటిఫికేషన్ జారీ చేసేలా పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీ చేశారు. పంచాయతీరాజ్ యాక్ట్ 2018లో సెక్షన్ 144 ప్రకారం డీ లిమిటేషన్ చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉత్తర్వులలో పేర్కొన్నారు. 10వ తేదీన కేబినెట్ ముందు ఎంపీటీసీ స్థానాల విభజన ప్రక్రియ చేపట్టడం చూస్తుంటే సర్పంచ్ ఎన్నికలకు ముందు పరిషత్ ఎన్నికలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాండూరు నియోజకవర్గంలో 143 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తమ స్థానాల రిజర్వేషన్ ఎలా ఉంటుందోననే విషయపై ఆశావహుల్లో చర్చ మొదలైంది. దీంతో పల్లెల్లో ఎన్నికల వేడి మొదలైంది.



అక్రమాల్లో డీలర్ల పాత్ర?

ఒక్కొక్కరు 120 క్వింటాళ్ల బియ్యం తరలింపునకు సహకారం!!

- వెలుగులోకి వస్తున్న సంచలన విషయాలు
- తనిఖీలు ముమ్మరం చేసిన విజిలెన్స్ అధికారులు
- విచారణాధికారిగా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా
- నేడు మిగతా ఎమ్ఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు

మేడ్చల్, జూలై 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కాప్రా, రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ (మండల స్థాయి గోదాంలు)లలో విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో 900 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో ఇద్దరు ఇన్‌చార్జిలు, ఒక టెక్నికల్ అసిస్టెంట్, ఇద్దరు డీఈవో(ఆపరేటర్లు)లను సస్పెండ్ చేసిన విషయం విదితమే. మంగళవారం కూడా అధికారులు మరోసారి ఆయా ఎమ్ఎల్ఎస్ పాయింట్లలో తనిఖీ చేపట్టారు. రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ పరిధిలోని పలువురు డీలర్ల పాత్ర సైతం ఉందనే అనుమానంతో రేషన్ దుకాణాల్లోనూ

మిగతా 8వ పేజీలో...



అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ

కాగా, జిల్లాలో వెలుగు చూసిన రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో విచారణాధికారిగా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను నియమించారు. మంగళవారం ఆమె విజిలెన్స్ అధికారులతో కలిసి కాప్రా, రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. మరో రెండు రోజుల పాటు ఈ తనిఖీలు నిర్వహించి అధికారులు ఇచ్చే తుది నివేదికల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటారని సమాచారం.



ముమ్మరంగా విత్తనశుద్ధి కేంద్రం నిర్మాణ పనులు

కులకచర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో విత్తన శుద్ధి కేంద్రం షెడ్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసింది. ఇది తెలంగాణలో రెండో విత్తన శుద్ధి కేంద్రం. ప్రస్తుతం రూ.33 లక్షలతో షెడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. షెడ్ పూర్తి కాగానే మిగతా రూ.27 లక్షలతో మిషనరీ ఏర్పాటు చేయనున్నారు. మండల రామలింగేశ్వర చిరు ధాన్యాల ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణం కొనసాగనుంది. చిరు ధాన్యాలు కందులు, పెసర్లు, బెబ్బెర్లు, సజ్జలతో పాటు వరి, జొన్నలు, మొక్కజొన్నలు, శనగలు, వేరుశనగ ఇతర విత్తనాలను ఇక్కడ శుద్ధి చేయనున్నారు. కులకచర్ల ఏపీయం శోభ మాట్లాడుతూ విత్తన శుద్ధి కేంద్రం ఏర్పాటుతో మహిళలకు ఉపాధి లభించనుందన్నారు. విత్తనాలు శుద్ధి చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించవచ్చన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

- డీఎంహెచ్‌వో లలితాదేవి

వికారాబాద్/కోట్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి లలితాదేవి హెచ్చరించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా ప్రతీ మంగళవారం పీహెచ్‌సీల్లో స్ర్కీనింగ్ నిర్వహించాలన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని సిద్దులూరు, రామయ్యగూడ, ధారూరు, నాగ సముందర్, కోట్పల్లి, బంట్వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె సందర్శించి రికార్డులన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్ స్ర్కీనింగ్, పోషకాహార లోప సమస్యలు, జననేంద్రియాలకు సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ, రుతుస్రావ సమస్యలు, లైంగిక వ్యాధులు తదితర సమస్యలకు పరిష్కారం చూపే విధంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సాధారణ జబ్బులతో వచ్చే రోగులకు మంచి నాణ్యమైన సేవలు అందించాలన్నారు. సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సేవా గుణంతో పని చేయాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సరిపడా మందులు, మంచినీరు, రికార్డుల నిర్వాహణ క్రమం తప్పకుండా చేయాలన్నారు. ల్యాబ్‌లలో అందుబాటులో ఉన్న అన్ని పరికరాలు పనిచేసే స్థితిలో ఉండాలని సూచించారు. కోట్‌పలి ఆరోగ్య కేంద్రంలో మిగిలిపోయిన పనులు, నీటి సమస్యతో పాటు, మైనర్ సమస్యలు ఉన్నందున కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మేఘన, సీహెచ్‌వో ఖయ్యూం, ఫార్మాసిస్టర్ రాజేశ్వర్ రెడ్డి, నాగమణి, ఏఎన్ఎం అపర్ణ, అంజలి, ఆశావర్కర్లు ఉన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న దివ్య దేవరాజన్

- సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

కులకచర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అన్నారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మహిళా సంఘాల సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, సీఐఎఫ్ ద్వారా రుణాలు తీసుకొని వివిధ రకాల ఉపాధితో ప్రతీ కుటుంబం ఏ విధంగా అభివృద్ధి చెందాలో అవగాహన కల్పించారు. మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు స్కూల్ యూనిఫాం కుట్టించడం, అమ్మ ఆదర్శ పాఠశాలల బాధ్యత, పెట్రోల్ బంక్‌లు, మహిళా శక్తి క్యాంటిన్‌లు, ఇలా ఎన్నో రకాలుగా ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ మహిళలు ప్రగతి పథంలో వెళ్తున్నారన్నారు. సమావేశంలో మహిళా సంఘాల అధ్యక్షులు, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



భూసార పరీక్ష ఫలితాల కార్డులను చూపుతున్న రైతులు, డీఏవో చంద్రకళ

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

కీసర, జూలై8(ఆంధ్రజ్యోతి): పశువుల ఎరువు, కంపోస్ట్, సేంద్రియ ఎరువులు వాడుకొని భూమి సారాన్ని పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ సూచించారు. అలాగే యూరియా తగిన మోతాదులో వేసుకోవాలన్నారు. మంగళవారం యాద్గార్‌పల్లి రైతువేదికలో మే, జూన్ నెలలో చేపట్టిన భూసార పరీక్షల ఫలితాల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. రైతులు తమ భూమికి తప్పక భూసార పరీక్షలు చేయించాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, మండల వ్యవసాయ అధికారి మాధవీతల, ల్యాబ్ టెక్నిషియన్స్ రైతులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు

- డీఆర్‌డీవో సాంబశివరావు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో మానసిక దివ్యాంగులను చిన్న చూపుచూడొద్దని డీఆర్‌డీవో సాంబశివరావు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని నైబర్‌వుడ్ సెంటర్(మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం)ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. క్రమం తప్పకుండా చిన్నారులను నైబర్‌వుడ్ సెంటర్‌కు తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. అలగే ఇక్కడ నేర్పించే ఫిజియో థెరపీని ఇంట్లో పిల్లలచేత చేయించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. సెంటర్‌కు వచ్చే వారిపట్ల అప్యాయంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నైబర్‌వుడ్ సెంటర్ సిబ్బంది, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాంబశివరావు

హజ్ యాత్రికులకు ఘనస్వాగతం

శంషాబాద్ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హజ్ యాత్రకు బయలుదేరిన 40 మంది యాత్రికులు తిరిగొచ్చారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో వారి కుటుంబ సభ్యులు మంగళారం ఘన స్వాగతం పలికారు. యాత్రలో 40 రోజుల పాటు మక్కా మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండు సార్లు ఉమ్రా యాత్రకు తీసుకెళ్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ హఫీజ్ మొహ్మద్ ఫయాజ్ అలీ తెలిపారు



జుంటివాగు కబ్జాపై కలెక్టర్ ఆరా!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): 'జుంటువాగు కబ్జా?' అనే శీర్షికన అంటూ ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత శాఖ అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. ఈ విషయమై ఇరిగేషన్‌శాఖ ఈఈ మధుసూదన్‌రెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఈ వాగు కబ్జాపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి జాయింట్ సర్వేతో కబ్జాను గుర్తించి నివేదించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ వాగు, కబ్జా ప్రాంతం యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల పరిధిలో ఉండటంతో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ కూడా ఆరా తీశారు. తాండూరు ఇరిగేషన్ శాఖ డీఈఈ కిష్టయ్య సెలవులో ఉండటంతో బుధవారం వాగు కబ్జా ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో సంయుక్త సర్వే చేయించనున్నట్లు సంబంధిత శాఖ అధికారి ఒకరు తెలిపారు.

బల్దియా సార్లూ.. జర దేఖోనా!

● డ్రైనేజీపై దర్జాగా షెడ్లు వేసి వ్యాపారం
● పట్టించుకోని అధికారులు

తాండూరు, జూలై8(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫుట్‌పాత్, మురుగు కాల్వలపై అక్రమించుకున్న షెడ్లు, దుకాణదారుల ఆక్రమణలపై ఉన్న వాటిని తొలగిస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే వారు చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితికి పొంతన లేదని స్థానికులు అంటున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా డ్రైనేజీలు, రోడ్లను ఆక్రమించిన ప్రాంతాలను తొలగిస్తున్నామని ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బడాబాబులు డ్రైనేజీలపై కబ్జా చేస్తుంటే వాటి జోలికి వెళ్లకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాండూరులో రద్దీగా ఉండే సర్దార్‌పటేల్ చౌరస్తా వద్ద నేషనల్ హైవేపై పెద్ద మురుగు కాల్వ నిర్మించారు. ఆ కాల్వపై దర్జాగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏకంగా కబ్జా చేసి షెటర్ల విక్రయం దుకాణం, షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. పరిసరాల్లో ఉన్న దుకాణాలను తొలగించినప్పటికీ వారికి మినహాయింపు ఇచ్చారు. ఈ విషయంలో కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి ఈ కబ్జా ఎందుకు కనిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి.



తాండూరు సర్దార్ పటేల్ చౌక్‌లో డ్రైన్‌పై కబ్జాచేసి వ్యాపారం



హోమంలో భక్తులు

వేదాద్రిపై ఘనంగా దత్త జయంతి

తలకొండపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్జాల వేదాద్రిగుట్టపై శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం దత్త జయంతిని పురస్కరించుకొని దత్తాత్రేయ స్వామి అవన కార్యక్రమం, ప్రత్యేక పూజలు, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తాత్రేయ సేవాసమితి ఆధ్వర్యంలో అర్చకులు గూడ నర్సింహమూర్తి, శ్రీనివాసమూర్తి, మురళీధర్ శర్మల ఆధ్వర్యంలో అభిషేకం, మహాభిషేకం, సహస్రనామ పూజార్చన కార్యక్రమాలు, పూజలు కొనసాగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ, తిరుపతిరెడ్డి, అశోక్‌బాబు, నర్సింహులు, అజీజ్, ఆరిఫ్, కృష్ణయ్యగౌడ్, నరేందర్ గౌడ్, లక్ష్మణ్, రాజేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవీంద్రచారి, శ్రీశైలం యాదవ్, శ్రీరాములు, చెన్నయ్య, బాలస్వామి, సంపత్, మాధవులు, గోపాలకృష్ణ, దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్‌శర్మ, వెంకటేశ్వర శర్మ, ఆంజనేయ శర్మ, పాల్గొన్నారు.

గిరిజన బిడ్డకు బంగారు పతకాలు

మంచాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేదరికంలో పుట్టినా ఆర్థిక ఇబ్బందులను అధికమించి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాడు గిరిజన బిడ్డ మెఘావత్ నరేష్. మంచాల మండల పరిధి పటేల్ చెర్వుతండాకు చెందిన నరేష్ వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో 23వ స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాలు తీసుకుని శభాష్ అనిపించుకున్నాడు. పటేల్ చెర్వుతండాకు చెందిన మెఘావత్ రామూనాయక్, గంగబాయి దంపతుల మూడో కుమారుడు నరేష్‌కు చిన్నప్పటినుండే చావుపై అమితాసక్తి ఉండేది. నిరుపేద కుటుంబంలో పుట్టిన నరేష్ తన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాలయాల్లోనే పూర్తిచేయడం విశేషం. కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ ఆర్థిక విభాగంలో పీజీ పూర్తి చేశాడు. ఈ క్రమంలో మైక్రో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌కు సంబంధించి ఐదు అంశాల్లో నరేష్ చేసిన పరిశోధనలకుగాను బంగారు పతకాలు సాధించాడు. నరేష్ మాట్లాడుతూ పేదరికం అనేది ఉన్నత చదువులకు అడ్డుకాదని, కష్టపడి చదివినందువల్లే ఈ లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పాడు.



అవార్డు అందుకుంటున్న నరేష్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చేవెళ్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపల్లికి చెందిన నిరుపేద కృష్ణ ఇంట్లో పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సన్నబియ్యంతో చేసిన భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, కృష్ణ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, పాండుయాదవ్, జనార్దన్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

అనుమతులు లేని రిసార్ట్స్‌ను మూసి వేయాలి

● బోటు ప్రమాదంపై ఎంపీ కొండా ఆగ్రహం ● కలెక్టర్‌కు లేఖ

వికారాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా సర్పన్‌పల్లి చెరువు వద్ద ఈనెల 5వ తేదీన బోటింగ్ చేస్తున్న ఇద్దరు మహిళలు చెరువులో పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కాగా సర్పన్‌పల్లి చెరువు పక్కన అనుమతులు లేకుండా కొనసాగుతున్న వైల్డర్‌నెస్ రిట్రీట్ రిసార్ట్‌పై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పెట్టే విధంగా పర్యావరణానికి నష్టం కలిగించే ఈ రిసార్ట్‌ను తక్షణమే మూసి వేయాలని కలెక్టర్‌కు ఎంపీ మంగళవారం లేఖ రాశారు. ఎన్నో ఫిర్యాదులు, మీడియా రిపోర్టులు వచ్చినా అధికారులు చర్యలు తీసుకున్నా, గతంలో సీజ్ చేసిన తర్వాత కూడా మళ్లీ ఈ రిసార్ట్ యాజమాన్యం తిరిగి అక్రమంగా ప్రారంభించిందని పేర్కొన్నారు. రిసార్ట్ అక్రమంగా అసైన్మెంట్ భూములపై నిర్మించబడినదని అది ప్రభుత్వానికి చెందిన భూమి అయినప్పటికీ వాణిజ్య కార్యక్రమాలకు దుర్వినియోగం జరుగుతోందని తెలిపారు. స్థానిక రైతులు తరతరాలుగా పశువుల మేత కోసం, ఎడ్లబండ్లతో పొలాలకు వెళ్లేందుకు వాడుతున్న శిఖం భూముల్లో ట్రెంచ్‌లు తవ్వి, వారి రాకపోకలను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలను చెరువు ప్రాంతానికి రాకుండా చేయడానికి విదేశీ జాతీ కుక్కలను కాపలాగా పెట్టిన పరిస్థితి మరింత ఆందోళకరమని లేఖలో ప్రస్తావించారు. రిసార్ట్‌ను తక్షణమే మూసివేసి పూర్తిగా దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపీ లేఖ రాశారు.

జాతీయ రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి

వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అకాడమి నుంచి మన్నెగూడ జాతీయ రహదారి పనులను వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలనివి కారాబాద్ డిస్ట్రిక్ డెవలప్ మెంట్ ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. ఎన్‌హెచ్ 163మార్గంలో ప్రతీరోజు ఏదో ఒక చోట ప్రమాదం జరిగి మృతులు, క్షతగాత్రులు పెరుగుతున్నారని తెలిపారు. జిల్లా ప్రజా ప్రతినిధులు ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు. ఈ రోడ్డు విషయమై తమ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ ప్రజా సఘాల ప్రతినిధులు కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణమాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం ఆయన నివాసంలో మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.



కేసీఆర్‌ను కలిసిన సబితా ఇంద్రారెడ్డి, మెతుకు ఆనంద్



బంట్వారంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వైఎస్సార్ సేవలు మరువలేనివని

బంట్వారం జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి(వైఎస్సార్) సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి వైఎస్సార్ ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోచారం వెంకటేశం, మహేందర్ రెడ్డి, నర్సింహులు, నర్సింహారెడ్డి, వీరేశం, తౌఫిక్ పాషా, ముజీబ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

మహేశ్వరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని, ఈమేరకు త్వరలో పార్టీ కమిటీలు పూర్తి చేయనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ, మున్సిపాలిటీల కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు పార్టీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. నాయకులు వెంకట్‌రెడ్డి, జానకీరామ్, యాదయ్య, పద్మ, సమత, శేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



యాదయ్యను సన్మానిస్తున్న ఎస్సై వరప్రసాద్

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం

కడ్తాల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంది పోలీసులతో సమానమని ఎస్సై వరప్రసాద్ అన్నారు. నేర పరిశోధన, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. మండల కేంద్రానికి చెందిన వడ్డెర సంఘం అధ్యక్షుడు యాదయ్య, సంఘం సభ్యులు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈదమ్మ ఆలయంలో సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. రూ.10 వేల వ్యయంతో సీసీ కెమెరాలను కొనుగోలు చేసి మంగళవారం ఆలయం వద్ద సీసీ టీవీ ఇన్‌చార్జి మహేశ్, కానిస్టేబుల్ శేఖర్‌లతో కలిసి స్థానిక ఎస్సైకి అందజేశారు. యాదయ్యతో పాటు సంఘం సభ్యులను ఎస్సై అభినందించి సత్కరించారు. ఆలయాలు, ప్రార్థన స్థలాలు, పట్టణ, గ్రామాల ప్రధాన కూడళ్లు, దుకాణాల ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మేడ్చల్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, భూ భారతికి సంబంధించిన దరఖాస్తులకు వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఏమైనా ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం పని చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో డీపీఎం నర్సిములు, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

తాండూరురూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో నర్సింహులు పేర్కొన్నారు. మంగళవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో మహిళా శక్తి సంబురాలపై మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలను నూతన సంఘంలో చేర్పించి అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు వడ్డీలేనిరుణాలు, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, స్కూల్ యూనిఫాంలపై చర్చించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రోగ్రాం మేనేజర్ భీమయ్య, ఏపీఎం ఆనంద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, కార్యదర్శి భానుప్రియ, కోశాధికారి నాగమణి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

మునిసిపాలిటీల్లో ఉల్లాస్

» మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులకు బోధన

» వలంటీర్లు, మెప్మా, డీఆర్డీఏ, ఐసీడీఎస్, విద్యా శాఖల సమన్వయంతో అమలు



ఉల్లాస్ సర్వేను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రవికుమార్

తాండూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో వయోజన విద్యను అమలు చేయనున్నారు. 'ఉల్లాస్' పేరిట మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, లెక్కించడం నేర్పుతారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న యోజన. ఈ నేపథ్యంలోనే జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది.

జీవన, వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు..

అక్షరాస్యతతో పాటు, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంలో జీవన నైపుణ్యాలు, నియోలిటరేట్(కొత్తగా అక్షరాస్యులైన వారికి) స్థానికంగా ఉద్యోగాలు కల్పించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వారు చేస్తున్న పనుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందిస్తారు. ప్రాథమిక విద్యకు సమానమైన కోర్సులను ఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు నేర్పుతారు.

మార్గదర్శకాలు..

15ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసున్న నిరక్షరాస్యులు ఈ కార్యక్రమం కిందకి వస్తారు. నిరక్షరాస్యులతో 15 నుంచి 20 మంది చొప్పున గ్రూపులను ఏర్పాటు చేస్తారు. ఆన్‌లైన్ టీచింగ్, లెర్నింగ్, అసెస్మెంట్ సిస్టమ్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ సహకారంతో 'ఓట్‌లాస్' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా బోధిస్తారు. బ్లాక్ స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా/అంగన్‌వాడీ వర్కర్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ఇల్లిల్లు తిరిగి నిరక్షరాస్యులను గుర్తిస్తారు. 15 నుంచి 20 మంది చొప్పున గ్రూప్‌లను ఏర్పాటుచేస్తారు. వారికి బోధించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే వారికి గ్రూపుల బాధ్యతలను అప్పగిస్తారు.

బోధించే కేంద్రాలివే...

పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాలు, అంగన్‌వాడీసెంటర్లు వంటిచోట్ల మహిళలకు అక్షరాస్యత తరగతులను నిర్వహిస్తారు. డిజిటల్ కంటెంట్‌తో బోధించేందుకు కంప్యూటర్లు, టీవీలున్న గదులను గుర్తించేలా ప్రణాళిక రూపొందించారు. రోజూ రెండు గంటల పాటు బోధిస్తారు. అభ్యసన ప్రక్రియ పూర్తయ్యాక వయోజనులకు అసెస్మెంట్ టెస్టుకు నిర్వహించి వారి పెర్మామెన్స్ మేరకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. నిరక్షరాస్యత నిర్మూలించి ప్రజల జీవన నైపుణ్యాలను పెంపొందించి, 'సమగ్ర సామాజిక అభివృద్ధి' సాధనే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి కేంద్ర రూపకల్పన చేసింది. కాగా ఉల్లాస్ మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉంది. ఈ యాప్‌లో కార్యక్రమ వివరాలను నమోదు చేస్తారు.

1,051 మందికి ప్లాట్ల కేటాయింపు



మీర్కాన్‌పేట ఏటీసీ కేంద్రంలో లాటరీ తీస్తున్న అధికారులు

కందుకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఫార్మసిటీ నిర్వాసితులకు మండలంలోని మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలో హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో రెండో రోజు రైతులకు మంగళవారం లాటరీ ద్వారా ఇంళ్ల స్థలాలను కేటాయించారు. మొదటి రోజు అర ఎకరంలోపు లబ్ధిదారులకు 60 గజాల చొప్పున ఇంటి స్థలాలను 670 మందికి కేటాయించగా, మంగళవారం ఎకరం ఇచ్చిన రైతులకు 121 గజాల చొప్పున 1,051 మందికి ప్లాట్లను కేటాయించారు. లాటరీలో పాల్గొనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్‌మోహన్, కందుకూరు, యాచారం మండలాల రెవెన్యూ అధికారులు, టీఎస్ఐఐసీ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలిస్తున్న అధికారులు

దండుమైలారంలో కేంద్ర బృందం

ఇబ్రహీంపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు, పేమెంట్ విధానంలో సరికొత్త విధానాలను అమల్లోకి తీసుకురావడానికి రాష్ట్రంలో ఇబ్రహీంపట్నం మండలం ఎంపికైంది. ఈ క్రమంలో జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఎన్ఐఆర్డీలో శిక్షణ నిమిత్తం వచ్చిన వివిధ రాష్ట్రాల అధికారులు మంగళవారం దండుమైలారంలో పర్యటించారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉపాధి పనుల వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు డీఆర్డీవో సుభాషిణి వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ప్రాజెక్టు అధికారులు అలివేంద్ర కుమార్, స్వాగత్‌దాస్, అమిత్‌కుమార్, ఐసీ ఎన్ఐఆర్డీ నుంచి ప్రసాద్ మోహిత్, వెస్లీ అండ్ టీం నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నుంచి మురళీ, సందీప్, అబేద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మైల్వార్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



హెచ్‌ఎం, ఏజెన్సీ మహిళలతో మట్లాడుతున్న విద్యాధికారి దూప రాములు

బషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):'మధ్యాహ్న భోజన అందక విద్యార్థులు పస్తులు' అంటూ ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో బషీరాబాద్ విద్యాధికారి దూప రాములు మైల్వార్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటప్పతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఎందుకు వండిపెట్టలేదనేదానిపై ఆరా తీశారు. మూడు నెలలకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో భోజనం వండి పెట్టలేదని విద్యాధికారికి వివరించారు. భోజన ఏజెన్సీ మహిళలను పాఠశాలలకు పిలిపించిన విద్యాధికారి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు త్వరలో ఖాతాలో జమ అవుతాయని, విద్యార్థులకు భోజనం వండి పెట్టాలని సముదాయించగా ఒప్పుకున్నారు. అనంతరం నిర్వాహకులు పాఠశాలలో విద్యార్థులకు యథావిధిగా భోజనం వండి పెట్టారు. అనంతరం విద్యాధికారి స్థానిక ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశలపై చర్చిస్తూ సూచనలు చేశారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కసరత్తు



డ్రిల్లింగ్ మిషన్‌తో మట్టి నమూనాల సేకరణ

బషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ (నవాంద్గీ) రైల్వేస్టేషన్ గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆశాఖ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేక డ్రిల్లింగ్ మిషన్‌తో భూగర్భంలో మట్టి నమూనాల సేకరణ పరీక్షకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతలో ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టకపోవడంతో రెండు ట్రాకుల మీదుగా ఏర్పాటు చేసిన రైల్వేగేటుతో వాహనదారుడు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ రైల్వే అధికారులు ఆర్‌యూబీ నిర్మాణానికి మట్టి నమూనా పరీక్షలు చేయిస్తుండటంతో వాహనాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టి గేటు కష్టాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



జేసీబీతో ట్రాక్టర్‌లో లోడింగ్

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

మోమిన్‌పేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాస్లాబాద్ గ్రామ శివారులోని సర్వే నెం.36లో హైదరాబాద్‌కు చెందిన రియల్ వ్యాపారి నందివాగు ప్రాజెక్టు కుడి వైపు ఎఫ్‌టీఎల్‌కు దగ్గర భూమిని కొనుగోలు చేశాడు. అక్కడ ఫామ్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. ఫామ్‌హౌస్‌కు వెళ్లేందుకు రోడ్డు కోసం గత రెండు రోజులుగా సర్వే నెం.36లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రవీందర్‌ను వివరణ కోరగా మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులు గోవర్ధన్‌ను అక్కడికి పంపించి జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

38 కిలోల గంజాయి పట్టివేత

» నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పట్టుబడిన గంజాయి, నిందితులు

శంకర్‌పల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 38 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకుని నలుగురు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్ మంగళవారం రాజేంద్రనగర్ ఎస్‌వోటీ సీఐ అంజయ్య, మోకిల సీఐ వీరబాబుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు యువకులను కొల్లూరు గేటు సమీపంలోని బృందావనం గార్డెన్ వద్ద రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మోకిల పోలీసులు పట్టుకున్నారు, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన ప్రదీప్ వద్ద కొనుగోలు చేసిన గంజాయిని నలుగురు దశరథిప్రధాన్, సిబానహక్, నీలూ మండల్, సాగర్‌సస్‌మల్ తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 38కిలోల గంజాయితో పాటుగా రూ2 వేల నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయిని అమ్మిన ప్రదీప్‌పై కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న అతన్ని త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో తాటిమొక్కలు నాటాలి

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో తాటి, ఈత మొక్కలు నాటి గీత కార్మికులకు జీవనోపాధి కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలో కల్లు గీత సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మంగళవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సంఘీభావం తెలిపారు. రియల్ వ్యాపారులు నరికి వేసిన తాటిచెట్లను పరిశీలించారు. నరికిన తాటిచెట్ల స్థానంలో కొత్తగా తాటి, ఈత మొక్కలు నాటాలన్నారు. అంతకుముందు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ కల్లు గీత కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, కట్ట దర్శన్, బుర్ర వెంకటేష్‌గౌడ్, కార్యదర్శి భైరు పాండుగౌడ్, అనిల్‌గౌడ్, బాబురావుగౌడ్, జగదీష్‌గౌడ్‌పాల్గొన్నారు.

నేత్రాల సంరక్షణలో అజాగ్రత్త తగదు

» టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కళ్ల సంరక్షణలో అజాగ్రత్త తగదని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఎవరూ ఇబ్బంది పడొద్దన్న ఉద్దేశంతో నియోజకవర్గ వ్యాప్తంగా మెగా కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో 4వ రోజు నిర్వహించిన మెగా కంటి వైద్యశిబిరాన్ని రాఘువేందర్‌రెడ్డి సందర్శించారు. 800 మంది రాగా 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 350 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. దృష్టిలోపం ఉన్న 30 మందికి తొలిరోజు ఐవోఎల్ ఆపరేషన్ చేయించినట్లు చెప్పారు. ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, యూసఫ్ బాబా, శ్రీరాములు, అభినవ్‌రెడ్డి, గణేశ్, యాదయ్య, రమేశ్‌నాయక్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

తహసీల్దార్ బదిలీపై సంబురాలు

పరిగి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భూవివాదాల్లో ఆరోపణలు ఎదుర్కొన్న పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావుపై బదిలీవేటు వేసిన సందర్భంగా మంగళవారం పరిగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయాసంఘాల ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బస్సు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌లు మాట్లాడారు. అవినీతికి పాల్పడిన తహసీల్దార్ ఆనంద్‌రావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హబీబ్,సత్తయ్య, రఘురాం, ఆశోక్, చిట్టుపవర్, బాలయ్య పాల్గొన్నారు.

బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సందర్శించాలి



బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్

బొంరాస్‌పేట్/కొడంగల్/కోట్‌పల్లి జూలై8 (ఆంధ్రజ్యోతి): బూత్‌లెవల్ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రతీ ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాల పరిశీలనతో మార్పులు, చేర్పులపై జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమావేశం నిర్వహించారు. నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌ఏ (బూత్ లెవల్ అసిస్టెంట్)లను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను పరిశీలించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్‌లెవెల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్, ఎంఈవో చంద్రప్ప, ట్రైనర్లు నర్సిములు, కృష్ణారెడ్డి, ఆర్ఐ భాగ్యలక్ష్మి, జగదీష్, బల్‌రాజ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎల్‌ఎంటీ ఇమ్మాన్యుయెల్

కేశంపేట : ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కగా రూపొందించే బాధ్యత బూత్ లెవల్ అధికారి(బీఎల్‌వో)దేనని జిల్లా మాస్టర్ ట్రైనర్ ఇమ్మాన్యుయెల్ తెలిపారు. కేశంపేట మండలం కొత్తపేట రైతువేదికలో మంగళవారం బీఎల్‌వోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు ఫాం-6ను వాడాలని తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి బీఎల్‌వోలు కనీస అవగాహన కల్పించాలని సూచించారు. ప్రవాస భారతీయుల కోసం ఫాం-6ఏను వినియోగించాలని వివరించారు. ఫాం-7 చనిపోయిన, శాశ్వతంగా నివాసం మార్చుకున్న వారి ఓటర్లను తొలగించాలని సూచించారు. ఫాం-8 ద్వారా పేర్లు, అడ్రస్‌లలో తప్పులుంటే సరిచేయాలని తెలిపారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఎన్నికల నిర్వహణ డీటీ బాలవర్ధన్, కేశంపేట డీటీ గీత, ఆర్ఐ నివేదితలు పాల్గొన్నారు.

282 జీవోను రద్దు చేయాలి



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో క్యాబ్ డ్రైవర్ల నిరసన

ఘట్ కేసర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 10గంటల పని దినాన్ని వెంటనే రద్దు చేయాలని క్యాబ్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో 10గంటల పనిదినానికి సంబంధించిన జీవో నంబర్ 282 ప్రతులను మంగళవారం దగ్ధం చేసి నిరసన వ్యక్తంచేశారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం నేడు(బుధవారం) చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మిక సత్తాను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

దర్జాగా పోతులవాగు కబ్జా

● పొలాలు మునిగే ప్రమాదం ● ఆందోళనలో మారెపల్లి రైతులు

ధారూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ శివారులోని పోతుల వాగును దర్జాగా కబ్జా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో తమ పొలాలు మునిగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అల్లాపూర్ రెమిన్యూ పరిధిలో కొంతమంది రైతుల వద్ద భూములు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు పక్కనే ఉన్న పోతుల వాగును తవ్వి కబ్జా చేసి కాలువలా చేశారు. వాగు అంచున రాయితో సోలింగ్‌చేసి వాగు ప్రాంతాన్ని తమ పొలంలోకి కలిపారు. దీంతో వాగు కుచించుకుపోయి వరద నీరు పొలాల్లోకి పారే ఆస్కారముందని, సర్వే నంబరు 116 లోని దాదాపు 60 ఎకరాలు వరద ముంపునకు గురవుతాయని వారు అందోళన చెందుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వాగుకబ్జాపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అంతే గాక కబ్జాదారులు వాగు అంచున రాళ్లతో సోలింగ్ చేయడంతో నీళ్ల తాగటానికి పశువులు రాళ్లలో నుంచి వాగులోకి దిగలేకపోతున్నాయని పశువుల కాపురులు అంటున్నారు. కలెక్టర్ చొరవ చూపి వాగు కబ్జాను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వాల్టా కేసు నమోదు చేయాలి

పోతుల వాగును కబ్జాచేసిన కబ్జాదారులపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని మారేపల్లి గ్రామ రైతు వెంకట్‌రెడ్డి కలెక్టర్ ను కోరారు. వాగు కబ్జాను తొలగించాలని ఇరిగేషన్ ఏఈని కోరినా స్పందన లేదని అన్నారు. అదేవిధంగా పోతుల వాగును బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కో ఆర్డీనేటర్ వి.నందు మంగళవారం పరిశీలించారు. అధికారులు ప్రభుత్వ, అటవీశాఖ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. అటవీ భూమిని కబ్జా చేసిన జయరెడ్డి, లింగారెడ్డిలపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.



కబ్జాతో కుచించుకుపోయిన పోతులవాగు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వికారాబాద్ పరిధి మద్గుల్ చిట్టంపల్లికి చెందిన తల్వార్ యాదయ్య(30) వికారాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా ఇసుక లారీ అడ్డా వద్ద లారీని వేగంగా ఢీకొన్నాడు. తీవ్రగాయాలపాలైన యాదయ్యను స్థానికులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఎనిమిది నెలల కూతురు ఉంది. తల్వార్ వికారాబాద్ పట్టణంలో మొబైల్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీరికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.

వివాహిత హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ధారూరు,జూలై 8(ఆంధ్రజ్యోతి): వివాహిత హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ వికారాబాద్ కోర్టు మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని అవుసుపల్లికి చెందిన పి.నాగమణి చెల్లెలు కవితతో అదే గ్రామానికి చెందిన పి.చంద్రయ్యతో 2008లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.లక్ష నగదు, మూడు తులాల బంగారం, ఇతర వస్తువులు వరకట్నంగా ఇచ్చారు. వివాహనంతరం రెండు సంవత్సరాలు వీరిద్దరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత కవిత భర్త చంద్రయ్య మద్యానికి బానిసై కవితను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. పుట్టింటి నుంచి రూ.50వేలు అదనపు కట్నం తీసుకురావాలని వేధించసాగాడు. ఈ క్రమంలో 2012 మార్చి 3వ తేదీన రాత్రి కంపెనీ నుంచి ఇంటికి వచ్చిన చంద్రయ్య భార్యతో గొడవపడి కర్రతో కొట్టాడు. దీంతో కవిత ఇంట్లో ఉన్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై అప్పటి డీఎస్పీ చౌడేశ్వరి, ఎస్ఐ రమేశ్‌లు కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి తీర్పు వెలువరించారు. కవిత మృతికి కారకుడైన భర్త పి.చంద్రయ్యకు జీవిత ఖైదు, రూ.7వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా పనిచేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

కుక్కదాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దేముల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుక్క దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నాగులపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ కిష్టప్పకు మేకలు ఉన్నాయి. ఉదయం మేకపిల్లలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న కుక్కను కిష్టప్ప తరిమే ప్రయత్నం చేశారు. దీంతో ఆ కుక్క కిష్టప్పపై దాడిచేయగా తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం తాండూరు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించాలని చెప్పడంతో వైద్యుడి సూచన మేరకు అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

పేకాటాడుతున్న ఐదుగురిపై కేసు

పెద్దేముల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గొట్లపల్లిలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టుచేసి కేసునమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు. గ్రామంలో కొంతమంది పేకాటాడుతున్నారనే సమాచారంతో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పశులపాకలో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. అక్కడ పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారివద్ద నుంచి రూ.7,230 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షేత్ర పరిశీలన.. జాబితా ప్రక్షాళన

(ఐదో పేజీ తరువాయి)

ఉండగా, 3,54,912 మంది మహిళలు, 19 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. గ్రామీణ ఓటర్లలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 9,949 మంది అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే నాటికి ఖరారు చేయనున్న ఓటరు జాబితాల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా కీలకం కానున్న నేపథ్యంలో అర్హులైన ఓటర్లు అందరూ జాబితాలో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ రాజకీయ పార్టీల నాయకులు తమకు అనుకూలంగా ఉండే ఓటర్లను నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తుంటారు. అదే విధంగా ప్రత్యర్థి వర్గాలకు చెందిన ఓటర్లు గల్లంతయ్యే విధంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేస్తుంటారు. ఎలాంటి ఆరోపణలను చోటు కల్పించకుండా ఈసారి ఓటర్ల జాబితా పకబ్బందీగా తయారు చేయాలని అధికారులు బీఎల్వోలకు స్పష్టం చేశారు.

నెలాఖరుకు తుది ఓటర్ల జాబితా

ఓటర్ల జాబితాలను సవరించేందుకు శిక్షణ కార్యక్రమాలు ముగిసిన బీఎల్వోలు బోగస్ ఓటర్లతో పాటు మరణించిన ఓటర్లను, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. మరణించిన వారి పేరు ఉంటే వాటిని తొలగించనున్నారు. పేర్లు తప్పుగా నమోదైన వారి వివరాలు సేకరించి సవరించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. అంతే కాకుండా జాబితాలో ఓటర్ల ఫొటోలు చాలా కాలం కింద దిగిన ఫొటోలు ఉంటే అలాంటి ఫొటోలు తొలగించి కొత్త ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించారు. ఓటర్ల పేర్లు, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు చోటు చేసుకుంటే బీఎల్వోల దృష్టికి తీసుకువస్తే వాటిని సరి చేయనున్నారు. దీంతో పాటు కొత్త ఓటర్ల నమోదు కూడా చేపట్టనున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాలు తయారు చేసే దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరు వరకు ఓటరు జాబితా సవరించే ప్రక్రియ పూర్తి చేసి తుది జాబితా రూపొందించాలని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే.

12న ఎంపీటీసీ స్థానాల తుది జాబితా...

ప్రతీ మండల పరిషత్తులో ఐదు ఎంపీటీసీ స్థానాలకు తక్కువ కాకుండా ఉండే విధంగా పునర్విభజన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. పలు పంచాయతీలు మునిసిపాలిటీల్లో విలీనమైన నేపథ్యంలో ఆ ఎంపీటీసీల పరిధి మారింది. కాగా, జిల్లాలో అన్ని మండలాల్లో ఆరు, అంతకంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 227 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, బంట్వారంలో తక్కువ ఎంపీటీసీ స్థానాలు ఉండగా, తాండూరు, మర్పల్లి మండలాల్లో ఎక్కువ ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బంట్వారం మండలంలో 6 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, బషీరాబాద్‌లో 12, బొంరాస్‌పేట్‌లో 11, ధారూరులో 12, దోమలో 14, దౌల్తాబాద్‌లో 14, కొడంగల్‌లో 11, కోట్‌పల్లిలో 7 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కులకచర్లలో 12, మర్పల్లిలో 15, మోమిన్‌పేట్‌లో 12, నవాబ్‌పేట్‌లో 12, పరిగిలో 11, పెద్దేముల్‌లో 13, పూడూరులో 13, తాండూరులో 15, వికారాబాద్‌లో 7, యాలాల్‌లో 13, చౌడాపూర్‌లో 9, దుద్యాల్‌లో 8 ఎంపీటీసీ స్థానాల చొప్పున ఉన్నాయి. ఒక్కో ఎంపీటీసీ స్థానంలో 3,500 మంది ఓటర్లలోపు ఉండేలా చర్యలు తీసుకున్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండలాల్లో ఎంపీటీసీ స్థానాల ముసాయిదాలు ప్రచురించి బుధవారం వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 10, 11వ తేదీల్లో అభ్యంతరాలను పరిష్కరించి తుది స్థానాలను 12న ప్రచురించనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, వజ్రేశ్‌యాదవ్

మేడ్చల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌లు మంగళవారం మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని కలిశారు. బోడుప్పల్‌లో సర్వేనంబరు 63లోని 336 ఎకరాల భూమి ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎకరానికి 600గజాల చొప్పున ఇచ్చేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగీకారం తెలిపిన రైతులతో కలిసి వారు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 15రోజుల్లో రైతులకు భూయాజమాన్యం హక్కులకు సంబంధించిన పత్రాలు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారి వెంట నాయకులు మహేష్‌గౌడ్, అజయ్‌యాదవ్, కిషోర్‌గౌడ్, రాపోలు ఉపేందర్, చీరల నర్సింహ, జంగయ్య, యాదగిరి, రామస్వామి ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, వజ్రేశ్‌యాదవ్

ఘనంగా చిగుళ్లపల్లి రమేశ్ జన్మదిన వేడుకలు



రమేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్, ఆయన సతీమణి మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌లు వికారాబాద్ పట్టణ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం రమేష్ కుమార్ జన్మదినం సందర్భంగా స్పీకర్ వారికి ఇంటికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అంతకు ముందు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వారి ఇంటికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వికారాబాద్ పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అభిమానులు గజమాలతో సత్కరించారు. అనంతరం బసంత్ ఫంక్షన్ హాల్‌లో వేడుకల్లో ఆయన అభిమానులు తరలివచ్చారు.

అక్రమాల్లో డీలర్ల పాత్ర?

(ఐదో పేజీ తరువాయి)

తనిఖీ చేపట్టారు. ఐదుగురు డీలర్లు ఒక్కొక్కరు 120 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలకు సహకరించినట్లు తనిఖీల్లో తేలినట్లు సమాచారం. డీలర్లకు బియ్యాన్ని తరలించే వాహనాలకు జీపీఎస్ ఉండటంతో అక్రమంగా బియ్యాన్ని తరలించేందుకు ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతీ నెలా ఈ తంతు జరుగుతున్నప్పటికీ ఒకేసారి 3 నెలల కోటా పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలకు తెరలేపినట్లు తెలుస్తోంది.

నేడు మిగతా చోట్ల తనిఖీలు

కాగా నేడు జిల్లాలోని మిగతా ఎమ్ఎల్ఎస్ పాయింట్లలో కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టనున్నట్లు సమాచారం. జిల్లాలో 6 ఎమ్ఎల్ఎస్ పాయింట్లు ఉండగా అందులో రెండు కాప్రా, రామంతాపూర్ పాయింట్లలో అక్రమాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. మిగతా నాలుగు చోట్ల కూడా అక్రమంగా బియ్యాన్ని తరలించినట్లు విజిలెన్స్ అధికారులకు ప్రాథమికంగా సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో ఎమ్ఎల్ఎస్ పాయింట్ల గోదాముల ఇన్‌చార్జిలు భయం గుప్పిట్లో గడిపినట్లు తెలిసింది. తమ ఫోన్‌లను స్విచాఫ్ చేయడంతో పాటు కొందరు ఫోన్లు లిఫ్ట్ చేయకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాముల ఇన్‌చార్జిలు డీలర్లపై ఒత్తిడి తీసుకువచ్చి పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం సేకరించినట్లు తెలుస్తోంది. కొంత మంది డీలర్లు కూడా గోదాముల ఇన్‌చార్జిల వేధింపులు తాళలేక వారు అడిగిన విధంగా బియ్యాన్ని అందించినట్లు సమాచారం. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో త్వరలోనే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వెలుగులోకి ఎమ్ఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వేధింపులు

సస్పెన్షన్‌కు గురైన రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి పాండురంగంరాజు గతంలో డీలర్లను తీవ్ర వేధింపులకు గురిచేసినట్లు తెలుస్తోంది. రామంతాపూర్‌తో పాటు మేడ్చల్ ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఆయన రేషన్ బియ్యం కోసం డీలర్లను వేధించేవాడని, బియ్యం ఇవ్వని డీలర్లకు సరైనా సమయంలో బియ్యం పంపించకుండా ఇబ్బందులకు గురిచేసేవాడని సమాచారం.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

కీసర రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వాసులు డిమాండ్ చేశారు. పనుల ఆలస్యం వల్లే ప్రమాదంలో యువకుడు మృతిచెందాడని ఆరోపిస్తూ రాంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బందెల పరమేష్, వర్కల పెంటయ్య గౌడ్, శ్యాంశర్మ, నాగరాజు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

యాలాల: పగిడ్యాల్-రాఘవాపూర్ రోడ్లను పూర్తిచేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. పగిడ్యాల్-రాఘవాపూర్ రోడ్డును మంగళవారం మల్కయ్య నాయకులతో కలిసి పరిశీలించారు.

బస్సును పునరుద్ధరించాలి

మేడ్చల్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గిర్మాపూర్ గ్రామానికి నిలిపి వేసిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మంగళవారం మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ మేడ్చల్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణంలో భాగంగా గిర్మాపూర్ గ్రామానికి నడిపే బస్సు సర్వీసును నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుతం వంతెన పనులు పూర్తి కావచ్చాయని తిరిగి బస్సు సర్వీసు ప్రారంభించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు సీజ్

మేడ్చల్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై ఏబీవీపీ కార్యకర్తలు తనిఖీలు నిర్వహించి అధికారులతో సీజ్ చేయించారు. మేడ్చల్ పట్టణంలోని సెంట్ క్లారేట్, హైటెక్, క్రీక్ ప్లానేట్ పాఠశాలల యాజమాన్యాలు బలవంతంగా విద్యార్థులతో యూనీఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు కొనిపిస్తున్నారంటూ మంగళవారం ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాఠశాలలను తనిఖీ చేశారు. దీంతో స్థానిక విద్యాధికారులకు సమాచారం ఇచ్చి యూనిఫామ్‌లను, పుస్తకాలను సీజ్ చేయించారు.

లైసెన్సులు లేని దుకాణాలపై చర్యలు

శామీర్‌పేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ నుంచి లైసెన్స్‌లు తీసుకోకుండా, రెన్యూవల్ చేసుకోకుండా దుకాణాలు నడిపితే చర్యలు తప్పవని కమిషనర్ జ్యోతి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం తూంకుంట మున్సిపల్ పరిధిలో కమిషనర్ జ్యోతి క్షేత్రస్థాయిలోట వివిధ దుకాణాల్లో లైసెన్సులను తనిఖీ చేశారు.



దుకాణ లైసెన్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జ్యోతి

కళరియపట్టులో విద్యార్థుల ప్రతిభ

కొడంగల్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే హైదరాబాద్‌లో ఓటీవీ ఛానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళరియపట్టులో కొడంగల్ పట్టణంలోని ఇండాస్ వ్యాలీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో కళరిపయట్టు శిక్షణ ఇస్తున్న రమేశ్‌ను సన్మానించారు.

ప్రభుత్వం స్కూల్ బస్సులు నడపాలి

వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు సైతం స్కూల్ బస్సులు నడిపించాలని వికారాబాద్ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, నర్సింహులు, శేఖర్, సత్యం, రాజు, రమేష్, నవీన్ ఉన్నారు.

లబ్ధిదారులకు ప్లాట్లు పంపిణీ చేయాలి

యాలాల, జూలై 8, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్వే నంబర్-289, 220కు సంబంధించిన లబ్ధిదారులకు ప్లాట్లు చేసి అందించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మండలసీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనేగారి శ్రీనివాస్ మంగళవారం తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

పెద్దేముల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీచెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి రూ.5వేలు అందజేశారు. గాజీపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీచెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని గాజీపూర్ గ్రామస్థులు నాయకులు నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీసర్పంచ్ రవికుమార్, కోఆప్షన్ మాజీ సభ్యులు నసీర్, మహిపాల్‌రెడ్డి తదితరులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కోరగా మహేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

తాండూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకువచ్చిన 282జీవోను వెంటనే రద్దుచేయాలని బుధవారం(నేడు) దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మున్సిపల్ కార్మికులు మంగళవారం కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, నర్సింహులు విజయవంతం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి



ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/కీసర/శామీర్‌పేట్/పెద్దేముల్/పరిగి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైఎస్ఆర్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వైఎస్సార్ 76వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ చెక్‌పోస్టు వద్దగల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, అంజిరెడ్డి, మల్లేష్, అనిత, వెంటనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంకుశాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు కవాడి మాదవరెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కీసర చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. శామీర్‌పేట్‌లో రాజీవ్‌రహదారి, దేవరయాంజాల్‌లో వైఎస్ విగ్రహాలకు జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, రామాలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, పార్టీ తదితర నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్దేముల్‌లోని తట్టెపల్లి గేటు వద్ద వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు గోపాల్, రియాజ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిగిలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

మందులతో క్షయ నివారణ

కులకచర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి మందులతో నయం అవుతుందని టీబీ నియంత్రణ జిల్లా అధికారి రవీందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని పుట్టపహాడ్‌లో మంగళవారం టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి 20 మందికి టెస్టు డోస్ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌కుమార్‌గౌడ్, పల్లె దవాఖానా వైద్యుడు మనీష్‌రెడ్డి, గోపాల్, టీబీ హెల్త్ విజిటర్ రాజునాయక్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: జినుగుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జినుగుర్తి ఇన్‌చార్జి వైద్యులు రషీద్, ఏఎన్ఎంలు కరుణశీల, నర్మద, సుశీల పాల్గొన్నారు.

దౌల్తాబాద్: క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని అన్నారు. బాలంపేట్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో మంగళవారం టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందిని పరీక్షించగా 18 మందికి క్షయవ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రఫీ, మంజుల, రాహత్, శ్రీధర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మేడ్చల్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డబీల్‌పూర్ గ్రామస్థులు ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ నిత్యానందంకు వినతిపత్రం సమర్పించారు.

సంక్షిప్తంగా..

వన మహోత్సవంలో భాగస్వాములవ్వాలి

కీసర: ప్రతీఒక్కరు వనమహోత్సవంలో భాగస్వాములవ్వాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం చీర్యాల్‌లో ఇంటింటికి రెండు మొక్కలను పంపిణీ చేశారు.

ఓటరు జాబితా పక్కగా ఉండాలి

బషీరాబాద్: ఓటరు జాబితా పక్కాగా ఉండేలా బీఎల్‌వోలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బషీరాబాద్ తహసీల్దార్ షాహిదా బేగం సూచించారు. బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో మంగళవారం బీఎల్‌వోల ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

కాంగ్రెస్ పేదల నేస్తం

దౌల్తాబాద్: కాంగ్రెస్ పేదల నేస్తమని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ అన్నారు. గోకఫస్లాబాద్‌లో స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ అందజేశారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

తాండూరు రూరల్: ఈనెల 14, 15వ తేదీల్లో వికారాబాద్‌లో జరిగే కేవీపీఎస్ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య కోరారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బొంరాస్‌పేట: బొట్లవనితండాకు చెందిన రమావత్ సంగీతకు మంజూరైన రూ.85వేల సీఎం సహాయనిధి చెక్కును మంగళవారం కాంగ్రెస్ నాయకులు దేశ్యానాయక్, మెగ్యానాయక్ అందజేశారు.

బోనాల జాతరకు ఏర్పాట్లు చేయాలి

మూడుచింతలపల్లి: జగ్గంగూడలో 12, 13 14న నిర్వహించే బోనాల జాతరకు ఏర్పాట్లు చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌కు జగ్గంగూడ సంపన్‌బోల్ గ్రామ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కొడంగల్: కొడంగల్‌లో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని అఖిల పక్షం నాయకులు మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయాదవ్, రమేశ్‌బాబు, ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు/పెద్దేముల్: తోర్మామిడి విద్యుత్ ఫీడర్‌లో ఉన్న విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడి శంకర్ నాయక్ తెలిపారు. అదేవిధంగా పెద్దేముల్ మండలం తుర్మామడి ఫీడర్‌లో గల పలు సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు(బుధవారం)రెండు గంటలపాటు కరెంటు సరఫరా ఉండదని విద్యుత్ డీఈఈ భానుప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

దుద్యాల: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలెపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.55లక్షల 20వేలు మంజూర్ చేసినట్లు తెలిపారు.

రైతు నేస్తాన్ని వీక్షించిన రైతులు

శామీర్‌పేట: వివిధ పంటల వ్యవసాయ సాగు పట్ల వ్యవసాయ శాఖ వారు మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రమేశ్ అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని అలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట గ్రామాల్లో గల రైతు వేదిక భవనాల్లో ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుంటే చర్యలు

బషీరాబాద్: వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపైకి వస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ హెచ్చరించారు. బషీరాబాద్-తాండూరు మార్గంలో మంగళవారం హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు

దోమ: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. తిమ్మాయిపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి నాయకులు శివకుమార్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్‌లతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

పరిగి/కులకచర్ల: నస్కల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రైతుబంధు మండల మాజీ కో-ఆర్డినేటర్ ఎం.రాజేందర్ మంగళవారం గ్రామానికి చెందిన బిల్లపాటి శ్రీనివాస్ సహకారంతో ఉచితంగా టై, బెల్టులు అందజేశారు. హెచ్ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా కులకచర్ల మండలం చెల్లాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొండా అంజిలయ్య ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

పూడూరు: విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడమే కాకుండా సమాజంలో వాటిని ఎలా అమలు చేయాలో తెలియజేయనున్నట్లు పూడూరు మండలం అంగడిచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజామైనుద్దీన్ అన్నారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్‌పర్సన్, మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.